క్లుప్తంగా

ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ప్రొద్దుటూరు : జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)డే సందర్భంగా స్థానిక వేంకటేశ్వర డిగ్రీ కాలేజీ ఆవరణలో విద్యార్థులు బుధవారం మొక్కలు నాటారు. కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉత్సవాలను తిలకించేందుకు వస్తున్న రద్దీని అదుపుచేస్తూ సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ పృథ్వీనారాయణ, ప్రిన్సిపల్ శారద భవానీ, కో ఆర్డినేటర్ గౌరీశంకర్, సలీం, మునెయ్య, దావీద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ డే

ప్రొద్దుటూరు : స్థానిక వేంకటేశ్వర పశు వైద్య కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డా.సీహెచ్.శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మొక్కలు నాటడం, స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించడం, రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేయడం, పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం చేస్తున్నారన్నారు. మంచి కార్యక్రమాలు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విభాగం అధ్యాపకులను ఆయన అభినందించారు. ఉత్తమ వాలంటీర్లను ఎంపికచేసి ప్రసంశా పత్రాలను అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.డి.ఇందిర, డా.రాజాకిశోర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సభ నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆర్యవైశ్య సభ నూతన అధ్యక్షుడిగా అయ్యపు వెంకట సురేష్ బాబు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. నూతన అధ్యక్షుడికి పూర్వపు అధ్యక్షుడు బన్నూరు కృష్ణమూర్తి మకుటం ధరించి శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రహ్మంగారిమఠం మండలంలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

డైరెక్టర్‌గా సుధాకర్‌రెడ్డి

చాపాడు : రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర నీటి పారుదల శాఖ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1000 డంపింగ్ స్కేల్ ఎత్తిపోత పథకాలు ఉన్నాయని, వీటిలో 160 మాత్రమే పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయన్నారు. మిగిలినవి పని చేయక రైతులకు ఉపయోగం లేకుండా పోయిందని, వీటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే 8లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎత్తిపోతల పథకాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

పరామర్శ

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జి.సుందర్‌రామిరెడ్డి మాతృమూర్తి గుర్రంపాటిసుబ్బమ్మ (83) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు సుందర్‌రామిరెడ్డిని ఫోన్‌లో పరామర్శించారు.

కమిషనర్ వైఖరిపై నిరసన

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తీరును వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ కార్మికులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రొద్దుటూరు విభాగం అధ్యక్షుడు బి.రామయ్య మాట్లాడుతూ.. కార్మికులు ఏదైనా సమస్య గురించి మాట్లాడేందుకు వెళ్తే.. కమిషనర్ దురుసుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కమిషనర్ ఫ్యూడల్ మనస్తత్వంతో కార్మికులను గెట్ అవుట్ అనడం సబబు కాదన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్న అకౌంట్లను యాక్సిస్ బ్యాంకుకు మార్చాలని మున్సిపల్ అధికారులు ఆదేశాలివ్వడంతో, అది ఇష్టం లేని కార్మికులు రాతపూర్వకంగా వినతి పత్రాలు సమర్పించేందుకు కమిషనర్ వద్దకు వెళ్లారన్నారు. సాటి ఉద్యోగులే అని కమిషనర్ గుర్తించకపోడం శోచనీయమన్నారు. కమిషనర్ తీరు మార్చుకోకపోతే పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి మధు, నాయకులు నాగరాజు, నిర్మల, గురుమూర్తి, శ్యాం పాల్గొన్నారు.

స్వశక్తి పరివార్ అభియాన్

బి.కోడూరు : స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని పెద్దుళ్ళపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌లో బుధవారం స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సర్పంచ్ పీరయ్య, మాజీ జెడ్పీటీసీ రామకృష్ణారెడ్డి, భానుమూర్తిరెడ్డి, సుబ్బారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జాన్‌విలియం, విజయలక్ష్మి, అశ్విని, గౌతమి, నూర్జహాన్, అయేషా, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకపావని.. జగజ్జనని


అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు


శివాలయంలో భవానీదేవిగా


సత్యనారాయణస్వామి ఆలయంలో మహేశ్వరీదేవిగా


ఆకట్టుకున్న బొమ్మల కొలువు

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవీ శరన్నవరాత్రుల్లో మూడో రోజున ప్రొద్దుటూరులో అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయం, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శారదాదేవి అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మీదేవిగా, సత్యనారాయణస్వామి ఆలయంలో మహేశ్వరిగా, శివాలయం, సూపర్‌బజార్ రోడ్డులోని చౌడేశ్వరీదేవి ఆలయాల్లో భవానీదేవిగా అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

శారదా దేవీ అలంకారంలో అంకాళమ్మ

రాజుపాళెం : దసరా శరన్నవరాత్రులలో భాగంగా అలాగే రాజుపాళెంలోని కొత్తకొట్టాల అంకాళమ్మ నగర్‌లోని అంకాళమ్మ తల్లి బుధవారం శారదా దేవీ అలంకారాలంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

బద్వేలు అర్బన్ : పట్టణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన బుధవారం కూడా వివిధ ఆలయాలలో అమ్మవారి అలంకారాలు తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అన్నపూర్ణాదేవిగా కోట పోలేరమ్మ

పోరుమామిళ్ల : రంపాడు రోడ్డులోని శ్రీ కోటపోలేరమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు.


చౌడేశ్వరీదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా


ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శారదాదేవిగా


చెన్నకేశవస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మీదేవిగా


వీరభద్రస్వామి దేవాలయంలో కౌమారిదేవి అలంకారంలో


కోదండరామాలయంలో శ్రీకృష్ణావతారము అలంకారంలో దర్శనమిస్తున్న స్వామివారు


రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శారదాదేవిగా


అన్నపూర్ణా దేవి అలంకారంలో కోటపోలేరమ్మ

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

బద్వేలు అర్బన్ : కార్మికులు ఎన్నో ఏళ్ళు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసి కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఏఐసీసీటీయూ జిల్లా నాయకులు కె.జకరయ్య, సి.హెచ్.నారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లోని సీపీఐఎంఎల్ లిబరేషన్ కార్యాలయంలో ఆటో, సుమో, ఆల్విన్, హమాలీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం 40 చట్టాలను నాలుగు చట్టాలుగా కుదించడమే కాకుండా 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు మార్చడం సిగ్గుచేటన్నారు. అలాగే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆయా వర్గాల కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. సమావేశంలో ఏఐసీసీటీయూ నాయకులు పాల్గొన్నారు.

దసరా కానుకగా మధ్యంతర భృతిని ప్రకటించాలి

గోపవరం : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దసరా కానుకగా ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, అదేవిధంగా 12వ వేతన సవరణ అమలుకు కమిషనర్‌ను, సిబ్బందిని నియమించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరుశ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బద్వేలు పెన్షనర్స్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 12వ పీఆర్సీ ప్రకటిస్తామని, ఐఆర్ ఇస్తామని, ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినప్పటికీ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల గురించి ఆలోచించలేదన్నారు. వెంటనే అన్ని సంఘాలను సమావేశపరిచి ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ దసరాకు 12వ వేతన సవరణ కమిషనర్‌ను నియమించి నివేదిక వచ్చేలోగా 30 శాతం తగ్గకుండా మధ్యంతర భృతిని ప్రకటించి అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఎయిడెడ్ ఉపాధ్యాయులందరికి హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాటం

ప్రొద్దుటూరు క్రైం : ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో మహిళల హక్కుల కోసం చైతన్య మహిళా సంఘం మూడు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ సంఘం తెలుగు రాష్ట్రాల కన్వీనర్ జ్యోతక్క పేర్కొన్నారు. చైతన్య మహిళా సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక రామేశ్వరం రోడ్డులోని తొగటవీర వీరక్షత్రియ కల్యాణ మండపంలో సీఎంఎస్ జిల్లా కన్వీనర్ పద్మలత అధ్యక్షతన రాష్ట్ర మహిళా సదస్సు నిర్వహించారు. జ్యోతక్క మాట్లాడుతూ వరకట్న హత్యలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను సాగించే ఎందరో మహిళలకు అండగా నిలిచిందని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మూఢ నమ్మకాలు మహిళలను అణచివేసే సాధనాలన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న వారిలో అవి అంధవిశ్వాసాలుగా ఉంటున్నాయని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత మాట్లాడుతూ భ్రూణ హత్యల వల్ల స్త్రీ పురుషుల రేషియో తగ్గి వివాహాలు కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏపీ స్టేట్ మహిళా కన్వీనర్ రాధా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలకు అక్కడే తాగడానికి పర్మిట్ రూములకు అనుమతి ఇచ్చిందన్నారు. బార్లను అర్ధరాత్రి వరకూ తెరచి మందు అమ్ముకొని రాష్ట్రాన్ని మద్యం మత్తులో ఉంచి ఖజానాలను నింపుతూ సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని అనడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ మహిళా చైర్‌పర్సన్ జయమ్మ, విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, ఎన్జీఓ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా కన్వీనర్ సురేష్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రషీద్, మహిళా శక్తి రాష్ట్ర కార్యదర్శి వడ్డ లక్ష్మీదేవి, న్యాయవాది హరిత, రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ మహమూద్, దళిత సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య, పీకే జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, జామాతే ఇస్లాం మహిళా కన్వీనర్ రెహానా, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య పాల్గొన్నారు.

పట్టపగలే హైడ్రామా!

- సినీ ఫక్కీలో దాదాపు వంద కిలోమీటర్లకు పైగా ఛేజింగ్
- గోవా మద్యాన్ని తరలిస్తున్న ముఠా పట్టివేత
- రూ.1,76,904 విలువైన మద్యం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

అనంతపురం : పట్టపగలే హైడ్రామా నడిచింది. గోవా మద్యం తరలిస్తూ కొందరు యువకులు ఎక్సైజ్ అధికారుల కళ్లు గప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో దాదాపు వందకు పైగా కిలోమీటర్ల మేర సినీ ఫక్కీలో ఛేజింగ్‌చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం సాయంత్రం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ వి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. రామ్మోహన్‌రెడ్డి వెల్లడించారు.

అడ్డుకుంటే చంపుతామంటూ..

గోవా నుంచి మద్యాన్ని బుధవారం ఉదయం అక్రమంగా జిల్లాలోకి తరలించుకుని వస్తున్నట్లుగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమై ఆత్మకూరు మండలం వడ్డుపల్లి టోల్ ప్లాజా వద్ద కాపు కాశారు. ఉదయం 10.30 గంటల సమయంలో అటుగా వచ్చిన స్విఫ్ట్ కారును అడ్డుకుని పరిశీలిస్తుండగా డ్రైవర్ వాకీ టాకీ ద్వారా వెనుక వస్తున్న ఇన్నోవా కారు డ్రైవర్‌ను అప్రమత్తం చేయడం గమనించారు. దీంతో వెనువెంటనే మరో వాహనంలో ఆత్మకూరు వైపుగా ఎక్సైజ్ అధికారులు వెళుతుండగా హంద్రీ–నీవా కెనాల్ వద్ద ఇన్నోవా కారు ఉన్నఫళంగా వెనక్కు తిరిగి కాలువ గట్టుపై నుంచి శరవేగంగా దూసుకెళ్లింది. దీంతో ఎక్సైజ్ అధికారులు తమ వాహనంలో వెంబడించారు. ఒకానొక దశలో ఎక్సైజ్ అధికారుల వాహనాన్ని ఢీకొని ముందుకు సాగుతూ ఇనుపరాడ్లను తీసి ప్రదర్శిస్తూ తమను అడ్డుకుంటే చంపుతామంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఎక్సైజ్ అధికారులు వదలకుండా ఇన్నోవా కారును వెంబడిస్తూ వెళ్లారు. చివరకు సాయంత్రం 4 గంటల సమయంలో కర్ణాటక సరిహద్దులోని తిరుమణి వద్ద ఉన్న బాలసముద్రం టోల్ ప్లాజా వద్ద ఇన్నోవా కారును అదుపులోకి తీసుకున్నారు.

పట్టుబడింది వీరే..

స్విఫ్ట్ కారుతో పాటు, ఇన్నోవాను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు వాటిని జిల్లా ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. రెండు వాకీటాకీలు, మొత్తం రూ.1.76 లక్షల విలువ చేసే హనీగ్రేడ్ బ్రాందీ (180 ఎం.ఎల్)– 97 బాక్సులు, గోల్డెన్ ఏఎస్ ఫైన్ విస్కీ (180 ఎం.ఎల్) – 16 బాక్సులు, మాన్షన్ హౌస్ బ్రాందీ (750 ఎం.ఎల్)– 3 బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కె.వీరేంద్ర, డి. ప్రవీణ్, కె.వెంకటేష్, కె.పవన్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. వీరిలో కె.వీరేంద్రపై మద్యం కేసులు చాలా ఉన్నాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన ఏఈఎస్ వి.శ్రీరాం, ఇన్‌స్పెక్టర్లు కె.అన్నపూర్ణ, ఎస్.అలీబేగ్, ఎస్ఐలు సి.నరేష్‌బాబు, ఎం.హరికృష్ణ, ఎన్.సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు రామచంద్ర, ఫణీంద్ర, రమేష్‌బాబు, కానిస్టేబుళ్లు వెంకటనారాయణ, వెంకటప్రసాద్, ఎస్.మారుతి, ఎం.మారుతి, శివానంద రెడ్డి, నాగముని, చరణ్ కుమార్, సందీప్, జయనాథ్ రెడ్డి, హెచ్.ఆర్. ప్రసాద్ (ఎస్ఐ), అనంతపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణను ఆ శాఖ ఉన్నతాధికారులు అభినందించారు.

ఈసీ నిర్లక్ష్య వైఖరిని వీడాలి

కాశినాయన : దొంగ ఓట్లు తొలగించడంలో ఎన్నికల కమిషన్ నిర్లక్ష్య వైఖరిని వీడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డీ. విజయ్‌జ్యోతి తెలిపారు. బుధవారం నరసాపురంలో ఓటర్ల జాబితాలో అవకతవకలపై ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఓట్ల జాబితా విషయంలో అనేక అవకతవకలు సృష్టించాయన్నారు. మరణించిన వారి ఓట్లను తొలగించడం లేదని విమర్శించారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రొద్దుటూరు : ప్రతిభ చూపిన విద్యార్థులకు ట్రస్టు ద్వారా ఉపకార వేతనాలు ఇవ్వడం అభినందనీయమని వైవీ.నాయుడు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వై.వినయ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్, ట్రిపుల్ ఈ, సీఎస్ఈ, ఈసీఈ బ్రాంచ్‌లలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి వైవీ.నాయుడు అదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా సేవలందిచారని, ఆయన స్మారకార్థం ట్రస్టు ద్వారా ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ పి.గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిభ చూపితే దాతల ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ సి.సునీత, కోశాధికారి వై.సాయి వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శి బి.అంజలి ప్రసన్న, హెచ్ఓడీలు అశోక్‌బాబు, మంజునాథ్, విజయ్‌కుమార్, వీరభద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలి

బద్వేలు అర్బన్ : పట్టణ పరిధిలోని వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ నీరు కలుషితం కాకుండా చూడాలని పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణమూర్తి పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో పర్యటించిన అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరుబావుల చుట్టూ ఎటువంటి పేడదిబ్బలు లేకుండా చూడాలని, క్లోరిన్ శాతం తగు మోతాదులో ఉండాలని సూచించారు. ముఖ్యంగా పట్టణంలోని ప్రతి ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేసి తగిన ప్రమాణాలు పాటించేలా చూడాలని, నిబంధనలు పాటించని వారికి నోటీసులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, డీఈఈ సుమన్‌రెడ్డి, ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజనీర్లు మహేష్, బాబు, అమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను బుధవారం శ్రీనివాస నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఇర్ఫాన్‌బాషా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఉందని, దానిని అధిగమించి పారదర్శకంగా వ్యవహరించడానికి ప్రస్తుతం స్మార్ట్ రేషన్ కార్డులను మంజూరు చేసిందన్నారు.

లోకేష్ మాటలు హాస్యాస్పదం

పోరుమామిళ్ల : ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం ఏం పీకిందని మంత్రి లోకేష్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తల్లికి వందనం మొదటి సంవత్సరం ఎగవేత. ఈ సంవత్సరం 87.48 లక్షల మందికి గాను 66.57 లక్షల మందికి ఇచ్చామని శాసనమండలిలో మంత్రి లోకేష్ చెప్పడంతో 30 లక్షల మందికి ఎగవేత జరిగింది. ఇప్పుడు ప్రైవేటు కళాశాలలు ఫీజు రీయంబర్స్‌మెంట్ పథక మూతపడే స్థితికి వచ్చాయన్నారు. జీతాలు ఇవ్వలేక, నిర్వహణ ఖర్చులకు డబ్బులేక కాలేజీ యాజమాన్యాలు ప్రభుత్వ బకాయిల కొరకు ఎదురు చూస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని, విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకోవాలని నాగార్జునరెడ్డి అన్నారు.

ఆర్థిక చేయూతను అందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూతను అందించడమే పీఎం లోక్‌కల్యాణ్ పథకం ముఖ్య లక్ష్యమని మెప్మా పీడీ కిరణ్‌కుమార్, ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక గాంధీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద లోక్‌కల్యాణ్ మేళా పీఎం స్వనిధి పథకం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పట్టణాల్లోని వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు వారు తెలిపారు. మొదటి విడతగా రూ.15 వేలు, రెండవ విడతగా రూ.25 వేలు, మూడవ విడతగా రూ.50 వేలు రుణాన్ని అందించనున్నట్లు తెలిపారు. మెప్మా సిబ్బంది అర్హులైన వీధి వ్యాపారులను గుర్తించి దరఖాస్తు చేసుకునేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, అర్బన్ ఎస్ఐ జయరామిరెడ్డి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, మెప్మా సిబ్బంది, వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న వద్ది సురేఖ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వద్ది సురేఖ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో చైర్మన్‌గా వద్ది సురేఖ, వైస్ చైర్మన్‌గా పట్నం లక్ష్మణ్ కుమార్, సభ్యులుగా గోర్ల నరసింహారావు, మంచి నాగేంద్రమ్మ, యానం దిలీప్‌కుమార్‌రెడ్డి, వేల్పుల పద్మలత, మాబూ షరీఫ్, ఇంటి రెడ్డయ్య, వణం రమాదేవి, ముత్యాల పద్మజ, నక్క రాణి, కొంకి సుమలత, వెంకటప్ప గారి సుధాకర్, బొగ్గరపు వెంకటేశ్వర్లు, మార్తల రాధలు మార్కెట్ కమిటీ కార్యదర్శి పందిటి రత్నరాజు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, సీఎం.సురేష్‌నాయుడు, కొండారెడ్డి, వీఎస్ ముక్తియార్, ఆసం రఘురామిరెడ్డి, చల్లా రాజగోపాల్‌యాదవ్, ఈవీ.సుధాకర్‌రెడ్డి, బచ్చల పుల్లయ్య, చెన్నా శ్రీనివాసులు, మునివరా ఈశ్వరమ్మ, నూరి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌కు పునాది విద్యార్థి జీవితం


వేడుకలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ నారాయణ

మైదుకూరు : భవిష్యత్ జీవితానికి విద్యార్థి జీవితం పునాది వంటిదని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి అన్నారు. కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్, ఫ్రెషర్స్ దినోత్సవాల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో సంపాదించే విజ్ఞానం, నైపుణ్యం జీవిత నిర్మాణానికి దోహదపడతాయన్నారు. క్రమశిక్షణ అంకిత భావం ఉన్నత శిఖరాలకు చేరుస్తాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్‌లో చేరి సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వేడుకల్లో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు డాక్టర్ రాధారాం, అనురాధ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం దేశానికి ముఖ్యం


కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్, వైద్యులు

మైదుకూరు : ప్రతి ఇంట్లో మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్ అన్నారు. మండలంలోని జీవిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మహిళల ప్రసూతి, చిన్న పిల్లల ఆరోగ్యం, చెవి, ముక్కు, గొంతు, కంటి, దంత వైద్య పరీక్షలతోపాటు మహిళలకు టీబీ, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి వైద్య సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుధ, శ్రీనాథ్ రెడ్డి, ఖలందర్, సుమతి, గాయత్రి, ఆరోగ్య విస్తరణ అధికారి గురవయ్య, సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గాలిమర రెక్క..ఆకర్షిస్తున్నాయ్ విమానం లెక్క


విమానం రెక్కల వలే కనువిందు చేస్తున్న గాలి మరల రెక్కలు

చాపాడు : ఇక్కడ కన్పిస్తున్న గాలి మరల దృశ్యాలు బుధవారం సాయంత్రం చాపాడు మండలం నాగులపల్లె సమీపంలోని ప్రొద్దుటూరు – మైదుకూరు జాతీయ రహదారిలో చూపరులను కనువిందు చేశాయి. గాలి మరలను అనంతపురం జిల్లా తాడిపత్రికి తరలించే క్రమంలో బుధవారం వీటిని నాగులపల్లె వద్ద ఆపుకున్నారు. 70 మీటర్ల పొడవు ఉన్న ఈ గాలి మరలు రెక్కలు విమానం రెక్కల వలే ఉండటంతో దారలో వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు వీటిని చూస్తూ విమానం లెక్క ఉన్నాయంటూ ఆసక్తిగా చూస్తూ వెళ్లారు. బైక్‌లో వెళ్లే దారు ఆగి వెళ్లి చూసి, వాటి వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. పగటి సమయాల్లో దారిన వెళ్లే వాహనాలు వీటి వలన ఇబ్బంది కలుగుతుందని, రాత్రి సమయాల్లో వీటిని తరలిస్తున్నట్లు వాటిని తరలించే వారు చెబుతున్నారు.